కథ

# చిరుదీపం

''చీకటి జీవితాల్లో తేజోవంతమైన కాంతిరేఖలు నింపే మానవతామూర్తి మీరు. డాక్టర్ వాసుదేవ్‌లాంటి ఐ స్పెషలిస్ట్ ఈ విశాఖలోనే కాదు. రాష్ట్రంలో ఎక్కడా ఉండరు.

అలాంటివ్యక్తి డ్రింక్‌కి ఎడిక్ట్ అవడం ఎంతో దురదృష్టకరం. భార్య పోయినంతమాత్రాన జీవితమే లేదనుకోవడం వెర్రితనం.

అఫ్‌కోర్స్! కావ్యని మీరెంతగా ప్రేమించారో నాకు తెలుసు. అయినా ఆ వియోగం తట్టుకోలేక... మీరిలా మారిపోవడమేమిటి?

ఈ ప్రపంచంలో బాధలు లేని వాళ్ళెవరు చెప్పండి'' చెప్పడం పూర్తిచేసి వాసుదేవ్ వైపు చూసాను.

అతడు బాల్కనీ దగ్గర చేతులు కట్టుకుని ఆకాశం వంక దిగులుగా చూడసాగాడు.

కావ్య, వాసుదేవ్‌లు ప్రేమించి పెళ్లిచేసుకున్నారు. కావ్య మరణించి మూడు నెలలు దాటింది.

కావ్య నా స్నేహితురాలు మాత్రమే కాదు. మా ఇద్దరి మధ్య దూరపుబంధుత్వం కూడా ఉంది. పెద్దల్ని ఎదిరించి వాసుదేవ్‌ని పెళ్లిచేసుకున్నప్పుడు ఆ జంటని తనే అభిమానంతో ప్రోత్సహించింది.

కాని విధి విలాసాన్ని ఎవరాపగలరు?

కావ్య కేన్సర్‌తో బాధపడుతోందని తెలిసి ఆమెని చూడ్డానికి వెళ్లినప్పుడు ఆమె సున్నితమైన పలుకులు నన్ను కుదిపేశాయి.

''మృత్యువు దగ్గరవుతోందని నాకు బాధలేదు. నేను పోయాక వాసుదేవ్ జీవితం తలక్రిందులవుతుందని తల్లిడిల్లిపోతున్నాను. నన్ను చూడందే ఒక్కరోజు కూడా అతనుండలేరు. నేను శాశ్వతంగా దూరమైతే అయనేమైపోతారో!''

ఆమె వేదన, వ్యధ చూసి చలించిపోయాను. వాళ్లిద్దరికి అన్యోన్యతను ఆ భగవంతుడే చూళ్ళేకపోయాడేమో!

ఓ రచయితగా, ఆత్మీయురాలిగా ఈ పరిస్థితులలో ఆమెని ఓదార్చడం మినహా మరేం చేయగలను? ఆమె మనసు శాంతించేలా మాట్లాడ్డానికి రా శాయశక్తులు కూడదీసుకున్నాను.

''స్త్రీ, పురుషులు ఒకరి హృదయాల్ని మరొకరికి అర్పించుకోవాలి కాని ఒకరి బంధనాల్లో మరొకరు చిక్కుకోకూడదు. కెరటాలు సాగరంలో ఉన్నా వేటికవే నింగిని తాకుతాయి. కాలప్రవాహంలో జ్ఞాపకాలు జారిపోతాయి. ఏ మనిషికైనా కాలమే మానసిక ధైర్యాన్ని ప్రసాదిస్తుంది.

ఇలా కావ్యకి ఆనాడు హితవచనాలు చెప్పినట్లే వాసుదేవ్‌కి నచ్చచెప్పడం నా ధర్మం అనిపించింది.

కాని.... అమావాస్య చంద్రుడిలా అంతులేని నిరాశలో కూరుకుపోయిన ఆ వ్యక్తిని చూస్తుంటే నాలో వేదన ఏరులా ప్రవహిస్తోంది.

అయినా.... తప్పదు. అతను తాగుడికి బానిస కాకూడదు. డబ్బుతో సంబంధం లేకుండా ఎన్నో సేవాకార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకి సేవచేసే వాసుదేవ్ అందరి మన్ననపొంది మరింత పేరుతెచ్చుకోవాలి.

అతని మౌనాన్ని గమనించి మళ్ళీ అన్నాను.

''వాసుదేవ్! మన జీవితం ఒక్కరితోనే ముడిపడి ఉందనుకోవడం అవివేకం కదా! 'చీకటిని తిడుతూ కూర్చునేకన్నా చిరుదీపాన్ని వెలిగించు అనేది' చైనా సామెత. ఎవర్నయినా పెళ్లి చేసుకుని మీ జీవితాన్ని నందనవనంగా మార్చుకోండి. కొన్ని పరిస్థితుల్ని బట్టి మార్పుని ఆహ్వానించక తప్పదు!''

వాసుదేవ్ దీర్ఘంగా నిట్టూర్చి నా ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. మా ఇద్దరి మధ్య క్షణాలు దొర్లిపోసాగాయి.

అతని మొహంలో మార్పు రావడం గమనిస్తున్నాను.

వాసుదేవ్‌కి నా రచనలంటే చెప్పలేనంత ఇష్టం.

''వసుమతీ ! మనసు బాగులేనప్పుడు నీ కథలే నాకు సేదతీరుస్తాయి. హృదయానికి నేరుగా తాకుతాయి'' అంటూ ఇలా ఎన్నోసార్లు మెచ్చుకున్నాడు నన్ను.

బహుశా... అందుకే కాబోలు! నా పలుకులకి అతడు బాగా ప్రభావితం అయినట్లు కనిపిస్తున్నాడు. నుదుటిమీద పడుతున్న మేఘమాలికల్లాంటి జుత్తుని పైకెగదోస్తూ అన్నాడు వాసుదేవ్.

''వసుమతీ! వేరొకర్ని పెళ్లాడ్డం ఎందుకు? నిన్నే పెళ్లిచేసుకోవాలనుకుంటున్నాను''

అంతే! త్రుళ్లిపడ్డట్లు అతనివైపు చూశాను.

ఒక్కసారిగా శరీరం కంపించినట్లయింది. అదురుతున్న పెదిమలతో మెల్లగా అన్నాను.

''నన్నా! నన్ను...పెళ్లాడ్డమేమిటి?''

''ఇందులో తప్పేముంది. నీకు భర్తపోయాడు. నాకు కావ్య దూరమైంది. ఆదర్శాలు గురించి చదివేకన్నా వాటిని ఆచరణలో పెట్టడం మంచిదని నా ఉద్దేశ్యం. గతించిపోయిన చైతన్య జ్ఞాపకాలు తలచుకొంటూ ఒంటరిగా ఎన్నాళ్లుండిపోతావు. నీభావాలు నాకెంతగానో నచ్చాయి. ఒంటరిగా ఉన్నప్పుడు నీ కథలు చదువుతూంటే మదిలో నిండుకున్న నైరాశ్యం క్రమంగా కరిగిపోతుంది.

నీవు తోడుంటే చాలు. ఈ ప్రపంచాన్ని జయించగలనన్న ఆత్మవిశ్వాసం కలుగుతుందనిపిస్తుంది. ఓ రచయిత్రిగా నాలో సంఘర్షణని అర్ధం చేసుకుని...నన్ను ముందుకి నడిపించే శక్తి సామర్థ్యాలు నీకే ఉన్నాయి వసుమతీ! కాదంటావా!''

ఏం సమాధానం చెప్పగలను? కలలో కూడా ఊహించని పరిస్థితి ఇది. గొంతు దాటి ఏ మాట రావడంలేదు.

శరీరం గడ్డకట్టినట్లవుతోంది. చైతన్య పోయాక 'నా' గురించి ఆలోచిండం మానేసాను. సాహిత్యమే ఊపిరిగా చేసుకుని బ్రతుకుతున్నాను.

కాని...ఇప్పుడు. 'నా' గురించి ఆలోచించే వ్యక్తి ఉన్నాడని తెలిసినప్పుడు ఆనందంతో తనువు ఊగిపోతోంది.

ఎడారిలో వసంతకాలపు శోభ ఆకస్మికంగా ప్రవేశించినట్లు అణువణువులో నూతనోత్తేజం ప్రవేశించింది.

''వసుమతీ! విధి మనిద్దరి జీవితాలతోను దారుణంగా ఆడుకుంది. గతించిన జీవితం గురించి ఆలోచించేకన్నా ప్రస్తుతపరిస్థితిని మనకనుకూలంగా మార్చుకోవడం మంచిదని నా ఉద్దేశం.

చీకటి జీవితాల్లో వెలుగు నింపుతున్నానని అన్నావు. కంటికి వెలుగునివ్వడం మాత్రమే కాదు. మనసులో కూడా వెలుగు నింపినప్పుడే ఎవ్వరైనా మానవతామూర్తి అనిపించుకుంటారు. నీకు అంగీకారమైతేనే మనపెళ్లి జరుగుతుంది!''

నేను ఆలోచనలోపడ్డాను. డ్రింక్‌కి దూరంగా ఉండమని వాసుదేవ్‌కి నచ్చచెప్పడానికి వస్తే ఇలా జరిగిందేవిటి? ఇది నేను ఊహించని మలుపు.

''వాసుదేవ్! మీ జీవితాన్ని మార్చడానికి వచ్చాను తప్ప...!''

సాలోచనగా అతని వైపు చూశాను.

మల్లెలు విచ్చుకున్నట్లుగా అతని వదనంలో కోటికాంతులు ప్రవేశించాయి.

''నిజమే వసుమతీ! నీ మనసేవిటో నాకు తెలుసు. ఒక్క విషయం గుర్తుంచుకో! మగాడి జీవితంలో శూన్యం ఏర్పడడానికి, అమృతధారలు కురియడానికి స్త్రీ మాత్రమే

కారణం. నీవు నా జీవితంలోకి ప్రవేశిస్తే డ్రింక్‌వైపుకన్నెత్తి చూడను. నన్నర్థం చేసుకో! నాకు నీ చేయూత కావాలి''

అతని అభిమానానికి, ఆరాధనకు నా శరీరం వశం తప్పుతోంది.

ఓ డాక్టర్ తన జీవితంలోకి నన్ను మనసారా ఆహ్వానిస్తున్నాడు.

అయినా సరే...వెంటనే ఏ నిర్ణయానికి రాలేదు. అక్కణ్నుంచి లేస్తూ అన్నాను.

''ఆలోచించి ఏ విషయం త్వరలో తెలియజేస్తాను!''

అతడంగీకారంగా తలూపాడు. వడివడిగా అడుగులు వేస్తూ ఇంటికి బయలుదేరాను. మనసులో మాత్రం ఏదో ప్రశాంతత. శరీరం...ఉత్సాహంగా గాల్లో తేలిపోవడం చూసి నాలో ఏదో స్పందన మొదలైంది. ఓ చెట్టు ఇచ్చే నీడ...ఓ తోడు అందించే శక్తి ఎంత గొప్పవో నాకు అర్థమవ్వసాగింది.

★★★

''వసుమతీ! మీరెంత అమాయకులో ఇప్పుడర్థమైంది. డాక్టర్ వాసుదేవ్ మిమ్మల్ని పెళ్లిచేసుకుంటున్నారని తెలిసినప్పుడే అనుకున్నాను. అంతు తెలీని అగాధంలోకి మీరు కూరుకుపోతున్నారని అనిపించింది.

మీ అభిమానిగా మీ శ్రేయస్సు కోరి చెబుతున్నాను. జీవితంలో మరోసారి మీరు మోసపోకూడదు. డ్రింక్‌కి ఎడిక్ట్ అయిన వాసుదేవ్ ఎంతో కాలం బ్రతకడు. అతణ్ణి పెళ్లాడి మరోసారి వితంతువుగా మారతారో...ఎలాంటి వ్యామోహాలకు లొంగకుండా స్థితప్రజ్ఞతతో వ్యవహరిస్తారో మీ ఇష్టం!''

''డాక్టర్ ప్రకాష్ పలుకులు వింటూ తలవొంచుకున్న నాలో అప్పటికే ఉప్పెనలాంటి సంచలనం ఊపందుకుంది. ఈ విషయమై ప్రకాష్ రెండుసార్లు ఫోన్ చేసినా, నేను పెద్దగా పట్టించుకోలేదు.

కాని...అసలు కారణం అతను వివరించి చెబుతూంటే ఒళ్ళంతా స్వేదంతో తడిసిపోతోంది. ఆవేశం...ఉద్వేగం పోటీపడి నన్ను ఊపేస్తున్నాయి. ప్రకాష్‌కి నా రచనలంటే ఇష్టం. అతను కూడా ఐ స్పెషలిస్టు. కాని వాసుదేవ్‌కి ఉన్న పేరు ప్రఖ్యాతులు ప్రకాష్‌కి లేవు.

ఇదంతా వింటూంటే విచిత్రంగా అనిపిస్తోంది. వాసుదేవ్ తన ఆరోగ్య పరిస్థితి ఏమిటో తేలీకుండా...ఇలా పెళ్లి ప్రతిపాదన తెస్తాడా!

అయినా ప్రకాష్‌కి తన పర్సనల్ లైఫ్ మీద ఎందుకంత ఇంట్రస్టు?

ఓ అభిమానిగా తన మేలు కోరి...ఇలా అంటున్నాడా! ఏమో!

ఇద్దరి డాక్టర్లలో ఎవరిని నమ్మాలి. వీళ్లిద్దరూ తన మీద ఎందుకింత శ్రద్ధ చూపిస్తున్నారు? అరుంధతీరాయ్‌లా తన పుస్తకానికి పెద్ద మొత్తంలో డబ్బు రాలేదు.

అయినా వాసుదేవ్‌కి డబ్బుమీద వ్యామోహం లేదు. ప్రకాష్ మాత్రం డబ్బు మనిషని తెలుసు.

''చెప్పండి వసుమతీ! ఇంకా వాసుదేవ్‌ని అభిమానిస్తున్నారా!''

ప్రకాష్ రెట్టించడంతో నాలో ఆలోచన్లు ఆగిపోయాయి. నాలో సంచలనాన్ని అరికడుతూ అన్నాను



''థ్యాంక్స్! బాగా ఆలోచించి ఓ నిర్ణయం తీసుకుంటాను!''

ప్రకాష్ మొహంలో రంగులు మారడం గమనించాను. కాస్సేపు హాస్పిటల్ విషయాలు చెప్పి అతను వెళ్లిపోయాడు.

మనసులో ఘర్షణ తగ్గడానికి టీవీ ఆన్ చేసాను. సిటీకేబుల్‌లో వార్తలు వస్తున్నాయి. నా దృష్టి సరిగ్గా అక్కడే ఆగిపోయింది.

ఓ యాక్సిడెంట్‌లో చూపు కోల్పోయిన పన్నెండేళ్ళ అమ్మాయికి ఆపరేషన్ తర్వాత చూపువచ్చింది. ఆ అమ్మాయిని ఇంటర్వ్యూ చేస్తున్నారు విలేఖర్లు.

''నా పేరు భైరవి. యాక్సిడెంట్‌లో చూపు పోగానే ఎంతలా బాధపడ్డానో ఆ భగవంతునికే తెలియాలి. చచ్చిపోయినా బాగుణ్ణు. అనుకున్నాను. కాని దేవుడిలా డాక్టర్‌గారు ఎంతో కృషి చేసి నాకు చూపునందించారు. ఆయన నూరేళ్ళు జీవించి ఎందరికో వెలుగునందించాలి. నాకిప్పుడు డాక్టర్‌గారే భగవంతుడు!''

చిరునవ్వుతో ఆ అమ్మాయి పక్కన నిలబడ్డ డాక్టర్ని చూసి నాలో ఏదో కదలిక.

నేను మరి ఆలోచించలేదు. ఫోన్ దగ్గరికి నడిచాను.

★★★

పౌర్ణమి చంద్రుడు వేయికళలతో వెలిగిపోతున్నాడు. ఆ చంద్రుడి కన్నా మిన్నగా ప్రకాశిస్తున్న వాసుదేవ్‌ని తన్మయత్వంతో చూడసాగాను.

''మాట్లాడు వసుమతీ! ప్రకాష్ నాగురించి చెడ్డగా చెప్పినా నన్ను పెళ్లిచేసుకున్నావెందుకు?''

వాసుదేవ్ నా ముంగురులు సవరించసాగాడు. ఆ మొహంలో మానవత్వం, నిజాయితీ గమనిస్తూ చిన్నగా నవ్వాను.

''అసలింతకీ మీరంటే ప్రకాష్‌కి ఎందుకంత జెలసీ?'' వింతగా అతనివైపు చూశాను.

వాసుదేవ్ గంభీరంగా మారిపోయాడు.

''సింపుల్ వసుమతీ! నాకున్న పేరుప్రఖ్యాతులు అతనికి లేవు. రెండుసార్లు అతనే బార్‌కి బలవంతంగా తీసుకువెళ్ళాడు. నేను తాగుబోతునని ప్రచారం చేసింది అతనే. రెండుసార్లు బార్‌కి వెళ్లినంతమాత్రాన నా ఆరోగ్యం చెడిపోతుందా? మృత్యువుకి దగ్గరైతే ఓ డాక్టర్‌గా నీ చేయందుకోవాలని ప్రయత్నిస్తానా!''

నా కళ్లముందు ఓ దృశ్యం మెదిలింది. టీవీలో కళ్ళు పోగొట్టుకున్న అమ్మాయి పక్కన ఆపద్బాంధవుడిలా నిలుచున్న డాక్టర్ వాసుదేవ్‌ని చూడగానే అన్పించింది.

ఈ వ్యక్తి ఇంకా ఎందరెందరికో వెలుగునివ్వాలి.

వాసుదేవ్‌వైపు ఆత్మీయంగా చూశాను.

''నీలో వెల్లివిరుస్తున్న మానవతాదృక్పథం నన్ను కదిలించింది. మీ మానసిక వికాసానికి, సేవానిరతికి నా చేయూత కావాలన్నారుగా. మీ సేవలో నేను కూడా పాలుపంచుకోవాలనుకుంటున్నాను. అందుకే దృఢసంకల్పంతో ఈ పెళ్లికి ఒప్పుకున్నాను''

వాసుదేవ్ కళ్ళు నక్షత్రాల్లా తళుక్కుమన్నాయి. ''థ్యాంక్స్''

ఆరాధనగా నా చేయి అందుకున్నాడతను.

★

విశ్వనాథ రమ